రైతులను రారాజుగా చూడడమే గంగా కావేరి సీడ్స్ వారి లక్ష్యం: కంపెనీ మేనేజర్ మధుకృష్ణ



3లో

PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఆల్ ఇండియా టైక్వాండో పోటీలకు కాకతీయ కళాశాల విద్యార్థుల ఎంపిక..



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 74 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 12 మార్చి 2026

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

- తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి
- 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ–2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. మిగతా2లో...

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా..?

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని
- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని
- కేరళం పర్యటనలో మోడీ గాటు విమర్శలు



**తిరువనంతపురం,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మిగతా2లో...

# వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

- డిసెంబర్ 9లో కాలనీ నిర్మాణం పూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం
- రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం
- నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు
- వెలుగుమట్ బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన భట్టి




**ఖమ్మం,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ సర్కారు పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేద కూడా గూడు ఉండకూడదని నిర్ణయించి ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, మిగతా2లో...

# లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి వాయిదా





2లో

# అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

- ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం
- సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



2లో

# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

● రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం ● సిఎం రేవంత్ తదితరుల హాజరు




**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023–2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

# ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే..

● కడియం, దానంలకు క్లీన్‌చిట్ ● వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు ● తుది తీర్పు వెలువరించిన స్పీకర్ ప్రసాదరావు ● తీర్పును స్వాగతించిన దానం, కడియం ● నేడు సుప్రీంలో కేసు తుది విచారణ





2లో

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



2లో

# తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ..చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖీ

వ్యవసాయ రంగానికి కొత్త డిస్కమ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పనిచేస్తున్న టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలకు అదనంగా కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మిగతా2లో...

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా..?

(మొదటి పేజీ తరువాయి)

మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహా యం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశా ల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోడీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ–2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను భట్టి బుధవారం పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి, తుమ్మలత కలసి ఆయన స్థల పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పేదలందరికీ ఇల్లు ఉండాలనేది తమ ఆశయం అన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇళ్లు మంజూరు చేయడంతో పాటు.. నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పేదల నిస్సహాయతను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయాలు చేశారు. అమాయకులను మోసం చేసి రూ.లక్షల్లో వసూలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేదని భట్టి ప్రశ్నించారు. ఇక్కడి పేదలను కొందరు మోసం చేస్తున్నారని కోర్టు చెప్పింది. మేం మానవీయ కోణంలో వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తున్నాం. అర్హులకు స్థలంతో పాటు.. ఇంటి నిర్మాణం చేసి ఇస్తున్నాం. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నాం అన్నారు. ఇన్నాళ్లు వెలుగుమట్ల పేదలను ఎందరో వచ్చి బెదిరించారు. ఇకపై వీరిని ఎవరూ బెదిరించలేరు.. డబ్బు వసూలు చేయలేరు. ఇకపై వారు నిర్భయంగా బతకవచ్చు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచే తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని భట్టి విక్రమార్క చెప్పారు. వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తాం అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులము కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. ఈ రాష్ట్రంలో జీవించే ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి అనేది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఆలోచన అన్నారు. ఆ ఆలోచనలో భాగంగానే రాష్ట్రంలో పేదవారి కోసం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు 22,500 కోట్లు ఒకేసారి మంజూరు చేసి చేసే చరిత్రలోనే రికార్డు సృష్టించిన ప్రభుత్వం తమది అనే డిప్యూటీ సీఎం తెలిపారు. కోర్టు తీర్పు మేరకే ఇక్కడి భూముల్లో ఉన్నవారిని కలెక్టర్ ఖాళీ చేయించాల్సి వచ్చిందన్నారు. ఖాళీ చేయించే సమయంలో పేదలపై ఒక్క లాఠీ దెబ్బ పడొద్దని చెప్పామన్నారు. భూదాన్ భూములను ఎప్పటికైనా పేదలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు.ఏ జిల్లా వారైనా సరే.. ఇంటి స్థలం లేకుంటే ఇంటి పట్టాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెలుగుమట్లలో 412 మందికి న్యాయం చేస్తున్నామన్నారు. ఇక్కడి భూదాన్ భూముల్లో 311 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు చెప్పారు. మరో 101 మంది తమకు సొంత స్థలం ఉందని.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అడిగారని వివరించారు. వెలుగుమట్ల భూముల విషయంలో కొందరు మొసలి కన్నీరు కార్చారు.

పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? పేదల పట్ల జాలి ఉంటే వారికి సాయం ఎందుకు చేయలేదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కొందరు పగటి కలలు కంటున్నారు. పేదల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా ప్రభుత్వం మాది. వెలుగుమట్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తాం. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే సదుపాయాలు పూర్తి చేస్తాం' అని పొంగులేటి అన్నారు.

# తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ .. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ కొత్త సంస్థకు తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అనే పేరు పెట్టారు. దీనిని సాధారణంగా 'రైతు డిస్కమ్'గా కూడా పిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ సంస్థను కంపెనీస్ యాక్ట్ 2013 ప్రకారం నమోదు చేయనున్నారు. హైదరాబాద్‌లోని మింట్ కంపౌండ్ ప్రాంతంలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త డిస్కమ్‌కు ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీను ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. విద్యుత్ రంగంలో ఆయనకు ఉన్న పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త సంస్థ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. 'రైతు డిస్కమ్' ప్రధానంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను చూసుకుంటుంది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ వంటి తాగునీటి పథకాల కోసం అవసరమైన విద్యుత్ సరఫరాను ఈ సంస్థ నిర్వహించనుంది. అలాగే హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (ఊఓచాః) అవసరాలకు కూడా విద్యుత్ అందించే బాధ్యత ఈ సంస్థపై ఉంటుంది.ఈ సంస్థ ద్వారా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు , విద్యుత్ లైన్‌ల నిర్వహణ వంటి పనులు చేపడతారు. అదేవిధంగా విద్యుత్ వినియోగాన్ని లెక్కించడం, మీటర్ల నిర్వహణ చేయడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం వంటి బాధ్యతలను కూడా ఈ సంస్థ నిర్వర్తిస్తుంది. కొత్త సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు సభ్యులుగా ఉంటారు. వీరిలో తిరుపతి రెడ్డి, పీ. కృష్ణారెడ్డి, వంగూరు మోహన్ రావు, ఎన్. నరసింహులు వంటి అధికారులు డైరెక్టర్లుగా నియమించబడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, భారీ సాగునీటి ప్రాజెక్టులు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై భారం పెరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను ప్రత్యేకంగా నిర్వహించేందుకు 'రైతు డిస్కమ్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# హాస్టళ్లపై గ్యాస్ సరఫరా ఎఫెక్ట్

● తగ్గిన ఫుడ్ ఐటమ్స్ సరఫరా

**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం హైదరాబాద్‌లోని హాస్టల్స్‌పై పడింది. ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య గ్యాస్ సంక్షోభం వాటిల్లిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా తగ్గింది. ఐటీ కారిడార్‌లో గ్యాస్ సరఫరా తగ్గడంతో ఫుడ్ ఐటమ్స్ తగ్గించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలవడంతో హాస్టల్ యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి.. ఈ అంశంపై హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిందని.. కావల్సినంత గ్యాస్ సరఫరా లేదన్నారు.. ప్రస్తుతం నగరంలో పదకొండు వేల హాస్టల్స్ ఉన్నాయని.. లక్షల మంది హాస్టల్స్‌లో ఉన్నారన్నారు.. ఎడ్యుకేషన్.. హాస్పిటల్‌కు సంబంధించిన హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా చేస్తున్నారని చెప్పారు.. 'కమర్షియల్ గ్యాస్ ఇవ్వకుంటే.. డొమెస్టిక్ గ్యాస్ రోజుకి ఒకటైన ఇవ్వాలని కోరారు.. అధికారులతో మాట్లాడాం.. రెస్పాన్స్ లేదు.. గ్యాస్ ఎక్కువగా కన్సంప్షన్ అయ్యే ఫుడ్ ఐటమ్స్ తగ్గిస్తున్నాం.. చపాతి దోశ వంటి ఐటమ్స్ తగ్గిస్తామని చెప్పాం.. హాస్టల్స్ మూసేసే పరిస్థితి రాదని అనుకుంటున్నాం..' అని హాస్టల్ యాజమాన్యాలు వెల్లడించాయి.

# అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

**అమరావతి,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ÷ర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్లా అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. వెలగపూడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

# ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే..


**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పార్టీ మారాన్ని పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసును స్పీకర్ మొత్తంగా కొట్టివేశారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నారని.. వీరి శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పును ప్రకటించారు. తాజా విచారణలో తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని దానం నాగేందర్, కడియం శ్రీహరి స్పష్టం చేశారు. దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అనర్హత వేటు పిటిషన్లను కొట్టేశారు. దీంతో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు ఊరట లభించినట్లయ్యింది. ఇదిలాఉంటే.. గురువారం సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై విచారణ జరగనుంది. ఇప్పటికే పలుమార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోగా స్పీకర్ తన నిర్ణయం ప్రకటించాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఇప్పటికే 8మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరికి క్లీన్ చిట్ ఇవ్వండతో మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. అయితే టెక్నికల్‌గా ఇది రుజువు కాకపోవడంతో దీనిని స్పీకర్ తిరస్కరించారు. ఈ క్రమంలో నేటి సుప్రీం విచారణలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

# లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

**న్యూఢిల్లీ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

● కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను లాభాల కోసం మార్చుకుంటే.. స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసానికి దెబ్బ అని అన్నారు.


# క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ

### కల్లూరు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ గర్ల్స్ హై స్కూల్‌ను సందర్శించిన ఎంపీడీవో డి. చంద్రశేఖర్

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం, సదుపాయాల తనిఖీ





**కల్లూరు, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో డి చంద్రశేఖర్ అన్నారు. పరీక్షలకు భయపడకుండా కష్టపడి చదివి దీటుగా ఎదుర్కొనాలని ఆయన పిల్లలకు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కల్లూరు మండల అభివృద్ధి అధికారి డి చంద్రశేఖర్ బుధవారం కల్లూరులోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ గర్ల్స్ హై స్కూల్‌ను సందర్శించారు.పాఠశాల సందర్శన సందర్భంగా ఆయన విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారి చదువుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా, ఆహారం నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.మధ్యాహ్న భోజన కార్యక్రమం అమలు తీరును పరిశీలించిన అనంతరం, పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి బియ్యం, పప్పులు, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. సరుకులు పరిశుభ్రంగా నిల్వ ఉంచాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన ఆహారం అందించాలనే విషయంపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై ఎటువంటి రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో కూడా మాట్లాడిన ఆయన, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో బోధన విధానం, విద్యార్థుల హాజరు, పరీక్షలకు సిద్ధత వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఇక ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని తమ ప్రతిభను నిరూపించాలని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు.ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. అధికారులు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ వల్ల పాఠశాలల్లో సేవల నాణ్యత మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో కొత్త ఉత్సాహం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాలపై దృష్టి సారించడం పట్ల స్థానికులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# రైతులను రారాజుగా చూడడమే గంగా కావేరి సీడ్స్ వారి లక్ష్యం: కంపెనీ మేనేజర్ మధుకృష్ణ




**అయినవోలు,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కోనూరు గ్రామం అయినవోలు మండలంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో రైతు ఇల్లందుల నరసయ్య మొక్కజొన్న చేనులో రైతులను ఉద్దేశించి నాణ్యమైన విత్తనాలు ఎన్నుకోవాలని అధిక దిగుబడులు ఇచ్చే గంగా కావేరి 31 53 అనే రకము నారింజ రంగు కలిగియుండు . పలు రకాల తెగులను తట్టుకొని రైతుకు అధిక దిగుబడినిస్తుందని కంపెనీ ఏరియా మేనేజర్ మధుకృష్ణ రైతుల ఉద్దేశించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్, వెంకటాపూర్ అజీం గారు, కోనూరు గ్రామ ఆగ్రోస్ డీలర్. అజయ్ గారు, మరియు కంపెనీ ప్రతినిధులు వెంకటేష్, మనోహర్ అయినవోలు మండల్ రైతులు సుమారు 200 మంది పాల్గొనడం జరిగింది.

# ఆల్ ఇండియా టైక్వాండో పోటీలకు కాకతీయ కళాశాల విద్యార్థుల ఎంపిక..




**హనుమకొండ : మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల టైక్వాండో పోటీలకు కళాశాల విద్యార్థులు టీ. నవీన్ బీఏ తృతీయ సంవత్సరం, వి శ్రీయాంశ్ బి బి ఏ మొదటి సంవత్సరం, ఏ మణికంఠ బిఏ మొదటి సంవత్సరం, కాకతీయ యూనివర్సిటీ తరపున మార్చి 16 నుండి 20 వరకు డిఎవి యూనివర్సిటీ, జలంధర్, పంజాబ్ నందు జరుగు పోటీలకు హాజరవుతున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ విద్యార్థులను మరియు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి శశికాంత్ ను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఈ రోజుల్లో సెల్ఫ్ డిఫెన్స్ లో నైపుణ్యం చాలా ముఖ్యము, దానివల్ల విద్యార్థులు శారీరికంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా తయారవుతారు అని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి కే రజినీలత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ ఎం రవికుమార్, క్రీడా కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, ఎన్ రమేష్‌చంద్ర శ్రీకాంత్,డా.ఎల్ సత్యనారాయణ మరియు సూపరింటెండెంట్ ప్రదీప అభినందించారు.

# షేక్ ఇస్మాయిల్‌కు బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు

### జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు

### తెలంగాణ గ్రామర్ స్కూలుకు గర్వకారణం









**కల్లూరు, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్న తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ కు జాతీయ స్థాయి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు అందుకొని ప్రత్యేక గుర్తింపు పొందారు. హైదరాబాద్‌లో ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ అవార్డ్ ప్రధానోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం ఆయనకు ప్రదానం చేయబడింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యా రంగంలో చేసిన సేవలు, పాఠశాల అభివృద్ధికి తీసుకున్న వినూత్న చర్యలు, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా అమలు చేస్తున్న విద్యా విధానాలు వంటి అంశాలను గుర్తించి ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ కు ఈ గౌరవాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఆయనకు మెమెంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించి నిర్వాహకులు సన్మానించారు.అదే కార్యక్రమంలో తెలంగాణ గ్రామర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కూడా విశేష ప్రతిభ కనబర్చి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థిని ఎం. జయంతి జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందగా, విద్యార్థి ఎం.డి. మాసీల్ అలీ ఖాన్ రాష్ట్ర స్థాయి టాపర్‌గా నిలిచి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి కూడా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎస్.కె. జానీమియా మాట్లాడుతూ ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ నాయకత్వంలో పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడుతున్నాయని అన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా పాఠశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విజయాలు సాధించడం తెలంగాణ గ్రామర్ స్కూలుకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ కృషి వల్ల పాఠశాల మంచి గుర్తింపు పొందుతోందని అన్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా విజయాలు సాధించేందుకు పాఠశాల ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ అవార్డు పాఠశాల అభివృద్ధికి మరో మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ అవార్డు తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా మొత్తం పాఠశాల సిబ్బంది విద్యార్థుల కృషికి వచ్చిన గుర్తింపని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న చైర్మన్, అకడమిక్ డైరెక్టర్ కేశవరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి కొనసాగిస్తామని అన్నారు.హైదరాబాద్‌లో ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగి, ప్రతిభను ప్రోత్సహించే వేదికగా నిలిచింది. ఈ అవార్డు తెలంగాణ గ్రామర్ స్కూల్‌కు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# ములుగు మున్సిపాలిటీలో ఆర్టీఐకి తప్పుడు సమాచారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: తోటకూరి శ్రీకాంత్ గౌడ్






**మల్లంపల్లి మండల ప్రతినిధి,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు: సమాచార హక్కు చట్టం (RTI Act) ప్రకారం ములుగు మున్సిపాలిటీకి అడిగిన ప్రశ్నలకు అధికారులు కావాలనే తప్పుడు సమాచారం ఇవ్వడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు నిజమైన సమాచారం అందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు చట్టాన్ని తేలికగా తీసుకుని తప్పుదారి పట్టించే సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన కీలక అంశాలపై ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా, ఇచ్చిన సమాధానాలు వాస్తవాలకు విరుద్ధంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల హక్కులను రక్షించడానికి ఉన్న చట్టం. అయితే అదే చట్టాన్ని కొందరు అధికారులు అవమానించే విధంగా వ్యవహరించడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోందని తెలిపారు. వెంటనే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేదంటే ఈ అంశాన్ని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్, జిల్లా కలెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# కటాక్షపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- ఏళ్ల తరబడి ఎదురుచూసిన కాలనీ వాసుల కల నెరవేరింది



**ఆత్మకూరు,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలోని 5, 6 వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ షబానా గఫూర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.చాలా సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలోని మూడు బాటల వద్ద మురుగు నీరు ప్రవహించడంతో ప్రజలు మురికినీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను స్థానికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఇప్పుడు సర్పంచ్ షబానా గఫూర్ ఆధ్వర్యంలో మోరీలు ఏర్పాటు చేసి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో కాలనీ ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల తర్వాత తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభమవడంతో సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనోజ్, వార్డు సభ్యులు రాజు నాయక్, సునీత శ్రీనివాస్ యూత్ అధ్యక్షుడు అజారుద్దీన్, కార్యకర్తలు వెంకటేష్, సుమన్, రాజు ఫీల్డ్ అసిస్టెంట్ ఓన్నాల చిన్ని తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు: చిట్యాల ఎస్ఐ సతీష్

**చిట్యాల, మార్చి 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిట్యాల సబ్ ఇన్ స్పెక్టర్ సతీష్ హెచ్చరించారు. మండలంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టరును పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కల్వపల్లి నుండి భూపాలపల్లి వైపు వెళ్తున్న ఒక ఇసుక ట్రాక్టరును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. సదరు ట్రాక్టరుకు ఎటువంటి అనుమతి పత్రాలు (గ్రావతీఎఫ్ం) లేకపోవడంతో, అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల వివరాలు: డ్రైవర్: గవాడే అమిత్ (తండ్రి: మాధవ్, వయస్సు: 29, నివాసం: మహారాష్ట్ర) ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసంగం లేదని స్పష్టం చేశారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా అక్రమ ఇసుక రవాణా గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తుపై శిక్షణ



**కల్లూరు, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్రొత్తగా ఏర్పడిన కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో భవన నిర్మాణ అనుమతి కోసం బిల్డ్ నౌ ఆన్లైన్ విధానం లో దరఖాస్తు చేసుకొనే విధానం గురించి భవన నిర్మాతలకు, మీసేవ సెంటర్ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ మున్సిపల్ కార్యాలయం లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ అనుమతులన్నీ ఆన్లైన్ విధానం లో బిల్డ్ నౌ వెబ్సైట్ లో ఇవ్వబడతాయి అని, 600 గజాల స్థలం వరకు ఎలాంటి ప్లాన్స్ అవసరం లేదు అని తెలిపారు. 75 గజాల లోపు స్థలం లో నిర్మించే నివాస భవనాలకు కేవలం ఒకే రూపాయి ఫీస్ తో ఇనిస్టెంట్ రిజిస్ట్రేషన్ విధానం లో అనుమతి పొందవచ్చు అన్నారు. అనుమతి ఫీజ్ లు ఆన్లైన్ లో మాత్రమే చెల్లించాలని, మధ్యవర్తుల ప్రమేయం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి, స్థానిక మీసేవ ఆపరేటర్లు, భవన నిర్మాతలు , మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంచార జాతుల సమగ్ర సర్వే పుస్తకాన్ని ఆవిష్కరించిన మేయర్ కోలగని శ్రీనివాస్....

**కరీంనగర్,మార్చి11(పీసీడబ్ల్యూ న్యూస్):** సంచార జాతులు, సమగ్ర సర్వే, సంచార, అర్ధసంచార, విముక్త జాతుల ఆర్థిక సామాజిక స్థితిగతుల అధ్యయనంపై రూపొందించిన పుస్తకాన్ని కరీంనగర్ లో బుధవారం రోజున మున్సిపల్ మేయర్ కోలగని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే మొదటి సారి సంచార జాతుల పై తెలంగాణ లో  సామాజిక సమరసతా వేదిక సమగ్ర సర్వే నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సామాజిక సమరత బాధ్యులు మాట్లాడుతూఅక్టోబర్ 26 నుండి డిసెంబర్ 31 వరకు తెలంగాణలోని 29 జిల్లాల్లో 33 తెగల వారిని సమరత కార్యకర్తలు కలిశారని, 1450 కుటుంబాల వద్దకు 70 మందికి పైగా సమరసతా కార్యకర్తలు వెళ్లి 7000 మందికి పైగా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారని తెలిపారు. ముఖ్యంగా ఈ సందర్భంగా ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక అంశాలతో పాటు 25 కి పైగా విషయాలను ప్రశ్నావళిగా రూపొందించడం జరిగిందన్నారు. వాటి ఆధారంగా సేకరించిన



సమాధానాలతో పారదర్శకమైన గణంకాలతో మ్యాప్ లు,గ్రాఫ్స్ తో , 136 పేజీలతో  కలర్ బొమ్మలతో కూడిన ఒక పుస్తకం ప్రచురించటం జరిగిందని వివరించారు. దీని  వల్ల అటు ప్రభుత్వానికి,ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం,విశ్వ విద్యాలయాల కులపతులు,ఆచార్యులకు, సివిల్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు,ఇటు సేవా కార్యక్రమాలు చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు,సామాజిక కార్యకర్తలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధానంగాస్వాతంత్ర్యం పొంది ఇన్నేళ్ళైనా సంచార జాతులు రాజ్యాంగ ఫలాలు అందక,బిక్కు బిక్కుమని బ్రతుకులు ఈడుస్తున్న దీన,దుఖితులు ఇంకా ఈ సమాజంలో వున్నారనే సత్యం అందరికీ బోధ పడుతుందన్నారు. పక్కా ఇళు ్ళ,చదువు,వైద్యం,  టాయిలెట్స్,విద్యుత్,ఉద్యోగాలు,మంచి నీళ్లు, ప్రభుత్వ పథకాలు,కుల సర్టిఫికెట్స్,ఆధార్ కార్డులు మొదలైనవి అందక జీవిస్తున్న ఈ వర్గాల వారి కోసం సమరసతా వేదిక అండగా నిలుస్తుందన్నారు. అటు పాలకులు ఇటు సభ్య సమాజం ఈ వర్గాల వారిని తోటి భారతీయులుగా భావించి,వారి అభ్యున్నతికి ఉపయోగపడే సూచనలు,సలహాలు అందించే విధంగా ఈ పుస్తకం  తెలుగులో,ఇంగ్లీష్ భాషలలో ప్రచురించడం జరిగి ందని తెలిపారు.ఇట్టి కార్యక్రమం లో సామజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి,తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు,బోయిని పురుషోత్తం,కనికరం లక్ష్మణ్,ఉండేటి శ్రీకాంత్,దావు సంతోష్ కుమార్ సమరసత సభ్యులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే ఫోర్ లైన్స్ ఎన్‌హెచ్ 563 పనులు ప్రారంభం



**గంగాధర మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ టు జగిత్యాల నేషనల్ హైవే ఫోర్ లైన్స్ చీఎ563 పనుల ప్రారంభోత్సవం కోసం కేంద్ర మంత్రి నితిన్ గట్కారి గారిని సమయం కోరిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ గారు.త్వరలో ప్రారంభం కానున్న రహదారి పనులు

# శాంతినగర్‌లో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**ఇంటి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్న కౌన్సిలర్లు**

**డ్రైనేజ్, వీధి దీపాలు, మంచినీటి సమస్యలపై త్వరిత చర్యలు**

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ**

**కల్లూరు, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని శాంతి నగర్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు పెడకంటి రామకృష్ణ, ఖమ్మం పార్టీ రాధా వీరస్వామి ముందుకు వచ్చారు. బుధవారం శాంతినగర్ లో 19వ వార్డు కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి, 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి వార్డులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. డ్రైనేజీలు పూడిక తీపిస్తూ నిల్వ ఉన్న మురుగునీరు వెళ్ళగొట్టించారు. వారు శాంతి నగర్ ప్రాంతంలోని వీధుల్లో తిరుగుతూ ప్రతి ఇంటి వద్ద ఆగి స్థానిక ప్రజలతో మాట్లాడారు. డ్రైనేజ్, వీధి దీపాలు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను నమోదు చేసుకుంటూ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను కౌన్సిలర్ల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల నీరు నిలిచిపోతుందని, కొన్ని చోట్ల ఇళ్లలోకి కూడా నీరు చేరుతుందని తెలిపారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించారు. డ్రైనేజ్ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కౌన్సిలర్లను కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కౌన్సిలర్లు ఖమ్మంపాటి రాధా వీరస్వామి, పెడకంటి రామకృష్ణ స్పందిస్తూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వారు అన్నారు. వార్డుల అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటామని కౌన్సిలర్లు తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా








పరిష్కరించడానికి మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని పని చేస్తామని వివరించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టామని కౌన్సిలర్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన చోట్ల నీటి ట్యాంకులు, పైపులైన్ల మరమ్మతులు, ఇతర ఏర్పాట్లు చేయించేందుకు మున్సిపాలిటీ అధికారులతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక శాంతి నగర్ ప్రాంతంలోని ప్రజలు మున్సిపాలిటీకి సహకరిస్తూ ఇంటి పన్నులు చెల్లించడం సంతోషకరమైన విషయమని కౌన్సిలర్లు అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంటి పన్నులు చెల్లించడం అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పన్నుల రూపంలో వచ్చే ఆదాయంతోనే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం సాధ్యమవుతుందని వారు తెలిపారు. ప్రజలు తమ బాధ్యతను గుర్తించి మున్సిపాలిటీకి సహకరించడం అభినందనీయమని కౌన్సిలర్లు కొనియాడారు. అదే విధంగా మున్సిపాలిటీ కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజలు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటం తమ బాధ్యతగా భావిస్తున్నామని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం తమ విధి అని అన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. శాంతి నగర్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని కౌన్సిలర్లు తెలిపారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజల సహకారంతో వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజలు కౌన్సిలర్ల పర్యటనను స్వాగతిస్తూ తమ సమస్యలను వివరించి పరిష్కారం కోరారు. కౌన్సిలర్లు కూడా ప్రజలకు భరోసా కల్పిస్తూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు ఖమ్మంపాటి వీరస్వామి, మాజీ ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్, నల్లగట్ల నాగబాబు, కనకపుడి జయరాజు, ఖమ్మంపాటి బాబురావు, నడ్డి వెంకటేశ్వర్లు, కంచపోగు ఉపేంద్రరావు, కొత్తపల్లి వీరేంద్ర పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సుగుటు గంగమ్మ జాతర

**- సూటూరు గంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు**





**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 10 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** పుంగనూరు పట్టణంలోని ప్యాలెస్ ఆవరణంలో వెలసి ఉండు శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. బుధవారం భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. 540 వ సంవత్సర జాతర సందర్భంగా కర్ణాటక, తమిళనాడు,  తెలంగాణ రాష్ట్రాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జమీందారుల కాలంనాటి నుంచి ఎంతో ప్రసిద్ధిగాంచిన పుంగనూరు శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు తరలివచ్చి గెరిగలు మోసి మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరజల్లుతున్న శ్రీ సుగుటూరు గంగమ్మ కు పురుషులు స్త్రీ వేషధారణ ధరించి గెరిగలు మోయడం ఆనవాయితీ.  జిల్లా ఎస్పీ ధీరజ్ కొని కునిబిల్లి ఆదేశాల మేరకు సి. ఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో దాదాపు 300 కు పైగా సిబ్బందితో పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మహిళ సంక్షేమానికి పెద్దపీట

**తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరుడు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదగాలి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**

**గంగాధర మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం  కొండన్న పల్లి, హిమ్మత్ నగర్, చిన్నాచంపల్లి, ఉప్పరమల్యాల, గోపాలరావుపల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి, కొండాయపల్లి, చర్లపల్లి(ఆర్), ర్యాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఒక కోటి పది లక్షల రూపాయలతో  నిర్మిస్తున్న మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు  శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను  కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గంగాధర మండలంలోని కొండన్న పల్లి, హిమ్మత్ నగర్, చిన్నాచంపల్లి, ఉప్పరమల్యాల, గోపాలరావుపల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి, కొండాయపల్లి, చర్లపల్లి(ఆర్), ర్యాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఒక కోటి పది లక్షల రూపాయలతో  నిర్మిస్తున్న మహిళా సంఘ భవనాల నిర్మాణానికి  శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఇస్లాంపూర్ లో ఎల్లమ్మ దేవాలయం ప్రహరీ గోడ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పథకాలన్నీ మహిళలే కేంద్రంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు  వంటి పథకాలన్నీ మహిళల పేరుతోనే  అమలవుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు



ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామ్ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,రెండ్ల శ్రీనివాస్,బిర్ల ఆనందం,గుడి రజిని ప్రవీణ్,బారజు ప్రభాకర్ రెడ్డి,బాసవేణి శ్రీనివాస్, అరె తెజ శ్రీ రాజశేఖర్, దాసరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినీలకు పరీక్ష సామగ్రి అందజేసిన దాతలు




**మానవత్వం చాటుకున్న కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ**

**పదో తరగతి విద్యార్థినీలకు అండగా నిలిచిన దాతలు  పరీక్ష సామగ్రి పంపిణీ**

**విద్యార్థినీలకు పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీ అందజేత**

**కల్లూరు, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినీలకు అవసరమైన పరీక్ష సామగ్రిని 18వ వార్డు కౌన్సిలర్ ప్రతాప్ ల్యాబ్ అధినేత పెడకంటి రామకృష్ణ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీ వంటి సామగ్రిని విద్యార్థినీలకు అందించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాల పేరు ప్రతిష్ఠలను పెంచాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి తమ మిత్రుల సహకారంతో మంచినీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక వ్యాపారవేత్త చారుగుండ్ల సందీప్ ప్రకటించారు. ఇందులో భాగంగా జెఎస్ఆర్ ట్రస్ట్ అధినేత జాస్తి శ్రీనివాసరావు పాఠశాలకు ఒక బీరువాను అందజేశారు. అంతేకాకుండా ప్రతి సంవత్సరం పాఠశాల అభివృద్ధి కోసం రూ. 12 వేల రూపాయలు అందజేస్తామని ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ సేవా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం చేయడం ఆనందకరమని పేర్కొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు: జిల్లా పౌర సరఫరాల అధికారి



కలెక్టర్ వారి కార్యాలయము (పౌరసరఫరాలు),
కరీంనగర్
తేది:11 -3 -2026

పత్రికా ప్రకటన

జిల్లా పౌర సరఫరాల అధికారి, కరీంనగర్.

తేది 11.03.2026 రోజున జిల్లా పౌర సరఫరాల అధికారి,కరీంనగర్ గారి ఆధ్వర్యంలో గ్యాస్ కంపనీల సేల్స్ ఆఫీసర్లతో మరియు ఎల్పిజి డీలర్లతో సమావేశం నిర్వహించడం జరిగినది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో గృహ అవసరాల కోసం వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత లేదు. ఎల్పిజి వినియోగదారులు ఆన్లైన్ మాత్రమే సిలిండర్ల ను బుక్ చేసుకోవాలి. ఏజెన్సీల వద్దకు మరియు గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లవద్దని కోరుచున్నాము. గ్యాస్ బుకింగ్ సమయం సింగిల్ సిలిండర్ కి 25 రోజులు డబుల్ సిలిండర్ కి 30 రోజులు వ్యవధి తర్వాత మాత్రమే కలదు. కావున వినియోగ దారులు దీనిని గమనించాలి.

గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించగలరు. హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని డొమెస్టిక్ సిలిండర్ల ఉపయోగించినచో కఠిన చర్యలు తీసుకోబడును. ఒకవేళ ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్లో సిలిండర్లను అమ్మాలని చూస్తే వారిపై నిత్యావసర సరకులచట్టం,1955 కింద కఠిన చర్యలు తీసుకోబడును. ఎల్పిజి వినియోగదారులు కెవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. గ్యాస్ ఏజెన్సీల వద్ద లేదా ఆన్లైన్ కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్లో కానీ గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కాని కెవైసీ పూర్తి చేసుకోవచ్చు. కావున వినియోగదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కోరుచున్నాము.

11/3/2026
జిల్లా పౌర సరఫరాల అధికారి,
కరీంనగర్. తరపున


అన్ని వార్తాపత్రికలకు
జిల్లా సమాచార & పౌర సంబంధాల అధికారి, కరీంనగర్ గారికి తగు సమాచార నిమిత్తం

**కరీంనగర్ టౌన్ మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు. బుధవారం (11.03.2026) జిల్లా పౌర సరఫరాల అధికారి ఆధ్వర్యంలో గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు మరియు ఎల్పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎల్పీజీ వినియోగదారులు గ్యాస్ సిలిండర్లను ఆన్లైన్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని సూచించారు. ఏజెన్సీలు లేదా గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లవద్దని కోరారు. సింగిల్ సిలిండర్ ఉన్న వినియోగదారులు 25 రోజుల తర్వాత, డబుల్ సిలిండర్ ఉన్నవారు 30 రోజుల తర్వాత మాత్రమే కొత్త బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్‌కు ఓటీపీ చెప్పి సహకరించాలని వినియోగదారులను కోరారు. హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్లను విక్రయించే ప్రయత్నం చేస్తే వారిపై నిత్యావసర సరుకుల చట్టం1955 కింద కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అన్ని ఎల్పీజీ వినియోగదారులు కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో లేదా గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్, యాప్ ద్వారా కూడా కేవైసీ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా పౌర సరఫరాల అధికారి కోరారు.

# స్కూల్ టైంలో వైన్‌షాప్ వద్ద టీచర్లు..?

**• పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారా స్థానికుల్లో ఆగ్రహం**

**ములుగు జిల్లా,మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలుర పాఠశాలకు చెందిన కొందరు ఉపాధ్యాయుల ప్రవర్తనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన స్కూల్ సమయాల్లోనే కొంతమంది టీచర్లు వైన్ షాప్ వద్ద కనిపించడం కలకలం రేపుతోంది.గురు అంటే దేవునితో సమానం అని భావించే భారతీయ సంస్కృతిలో, విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు ఇలాంటి ప్రవర్తన చేయడం అత్యంత దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు. చదువు నేర్పాల్సిన గురువులే స్కూల్ టైంలో మద్యం సేవనానికి వెళ్లడం వల్ల విద్యార్థులపై చెడు ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఫేర్‌వెల్ పార్టీ పేరుతో టీచర్లు వైన్ షాప్‌లకు వెళ్లడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురువులే ఇలా ప్రవర్తిస్తే విద్యార్థులకు ఏ సందేశం వెళ్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాలయాల పవిత్రతను కాపాడుతూ విద్యార్థుల భవిష్యత్తును రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొన్నారు.




# బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పెద్ద అండ

**ఎగ్జామ్ ప్యాడ్స్,హాల్ టికెట్లు పంపిణీ చేసిన శ్రీ నారాయణ కాలేజ్ చైర్మన్ మధుకర్ శ్రీ నారాయణ జూనియర్ కళాశాల చైర్మన్ మధుకర్ సేవా కార్యక్రమం పరీక్షల ముందు విద్యార్థులకు ప్రోత్సాహం పరీక్షల్లో విజయాలు సాధించాలని ఆకాంక్ష**





**ఉప్పల్ మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ నారాయణ జూనియర్ కళాశాల చైర్మన్ మధుకర్ ఆధ్వర్యంలో బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌తో పాటు హాల్ టికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.శ్రీ నారాయణ జూనియర్ కాలేజ్ చైర్మన్ మధుకర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే తప్పకుండా మంచి ఫలితాలు సాధించగలరని చెప్పారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహాయం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.అలాగే విద్యార్థులకు ఒక చిన్న సందేశం ఇస్తూ, జీవితంలో ముందుకు వెళ్లాలంటే "ఎక్స్క్యూజ్ మీ సార్, సారీ సార్, ఓకే సార్" వంటి మంచి సంస్కారం, మర్యాదతో మాట్లాడే అలవాటు ఉండాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో చదువుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు.

# ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరితకి "పొలిటిక్స్" పుస్తకం అందించిన సూరన్న



**కోమురంబీం ఆశిఫాబాద్, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజంలో రాజకీయ అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో రచించిన "పొలిటిక్స్" అనే పుస్తకాన్ని రచయిత సూరన్న కోమురంబీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత కి అందజేశారు.ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి రాజకీయాలపై సరైన అవగాహన ఉండటం ఎంతో అవసరమని తెలిపారు.సాధారణ ప్రజలు సులభంగా అర్థం చేసుకునే విధంగా రాజకీయాల ప్రాముఖ్యత, ప్రజల బాధ్యతలు, మంచి నాయకత్వ లక్షణాలు వంటి అంశాలను ఈ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ కె. హరిత పుస్తకాన్ని స్వీకరించి రచయితను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే అంశాలను పుస్తకాల రూపంలో ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ టుడే స్టేట్ బ్యూరో బూతే దేవేందర్ పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల పట్టాల పంపిణీ

**• గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరు**



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అతిథిగా హాజరై బాధితులకు ఇండ్ల పట్టాలు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మల్లన్న స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు నిరంతరం కృషి చేశామని తెలిపారు. **పేదల హక్కుల కోసం పోరాడిన ప్రజా నాయకుడు:** పేద ప్రజల హక్కుల పరిరక్షణే తన లక్ష్యమని పేర్కొన్న మల్లన్న, సామాన్య ప్రజలకు న్యాయం అందే వరకు వెనక్కి తగ్గబోమన్నారు. బాధిత కుటుంబాలకు ఇండ్ల పట్టాలు అందడం ఆనందకర విషయమని చెప్పారు.**బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా నిలిచిన మల్లన్న:** వెలుగుమట్ల బాధితుల సమస్య పరిష్కారానికి ప్రారంభం నుంచి అండగా నిలిచి అధికారులతో పలుమార్లు చర్చలు జరిపినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బాధితులకు కొత్త జీవితానికి నాంది అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోజాతో దైవ క్షమాభిక్ష ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్



**కరీంనగర్ టౌన్ మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** పవిత్ర రమజాన్ మాసం ముస్లింల ఆధ్యాత్మిక జీవితంలో అత్యంత పవిత్రమైన మరియు పరమార్థభరితమైన కాలమని మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్‌కు చెందిన ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ తెలిపారు. రమజాన్ నెల కేవలం ఉపవాసాల సమాహారం మాత్రమే కాకుండా మనసును శుద్ధి చేసే సాధనమని, సరైన జీవన మార్గాన్ని చూపే శిక్షణా కాలమని ఆయన పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ మరియు హదీసుల ప్రకారం రమజాన్ నెల ఆత్మపరిశీలన, తఖ్వా (దైవభీతి), క్షమాభిక్ష మరియు సమాజ శ్రేయస్సు కోసం వచ్చిన అరుదైన అవకాశమని తెలిపారు. ఖురాన్‌లో అల్లాహ్ ఇలా ప్రకటించాడని ఆయన గుర్తు చేశారు: "విశ్వాసులారా! మీ పూర్వీకులపై ఉపవాసం ఎలా విధిగా నిర్ణయించబడిందో, అలాగే మీపై కూడా నిర్ణయించబడింది. దీనివల్ల మీలో తఖ్వా జనించే అవకాశం ఉంది" (సూరె బఖరా 2:183).ప్రవక్త ముహమ్మద్ (స) హదీసును ఉటంకిస్తూ, "ఎవరు విశ్వాసంతో, ప్రతిఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటిస్తారో వారి గత పాపాలు క్షమించబడతాయి" (సహీహ్ బుఖారీ) అని పేర్కొన్నారు. నిజాయితీతో తౌబా చేసి రమజాన్‌ను గడిపితే అల్లాహ్ క్షమాభిక్ష ద్వారాలు తెరుచుకుంటాయని చెప్పారు.రమజాన్ మనిషిలో కరుణను పెంపొందించి పేదల బాధను అర్థం చేసుకునే గుణాన్ని పెంచుతుందని, అందుకే ఈ నెలలో జకాత్, సదఖా, ఫిత్రా వంటి దాన ధర్మాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ఉపవాసం వ్యక్తిగత ఆధ్యాత్మిక సాధన అయితే, దానం సామాజిక బాధ్యత అని ఆయన వివరించారు.అలాగే ఉపవాసం కేవలం తినడం, తాగడం మానుకోవడం మాత్రమే కాదని, అబద్ధాలు, చెడు ప్రవర్తన, ద్వేష భావాలను విడిచిపెట్టాలని ప్రవక్త హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. రమజాన్‌లో ఖురాన్ పఠనం, నమాజులు, తహజ్జుద్, తరావీహ్ వంటి ఆరాధనల ద్వారా ఆధ్యాత్మికంగా ఎదగాలని సూచించారు.ఈ రమజాన్ మన జీవితంలో మార్పుకు నాంది కావాలని, చెడు అలవాట్లను విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. రమజాన్‌లో నేర్చుకున్న నియంత్రణ, సహనం, దైవభీతి సంవత్సరం పొడవునా కొనసాగితేనే ఉపవాసాలకు నిజమైన ఫలితం లభిస్తుందని పేర్కొన్నారు.చివరగా అల్లాహ్ అందరికీ పటిష్ట విశ్వాసం, ఆరోగ్యం ప్రసాదించి తఖ్వాతో కూడిన జీవితం గడిపే భాగ్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు.

# వెలుగుమట్ల బాధితులకు ఇంటి పట్టాలు

**• ప్రజా పోరాటానికి న్యాయం • తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ • 311 మందికి 75 గజాల చొప్పున పట్టాలు • ఇళ్ల నిర్మాణ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది**



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగర శివారు వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇల్లు కూల్చివేతతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు ఆశాకిరణంగా మారాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రివర్యులు బాధితులకు 75 గజాల చొప్పున ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. భూదాన్ భూముల్లో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు అదే స్థలంలో ఇల్లు నిర్మించాలనే డిమాండ్‌తో బాధితులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులు కలిసి చేసిన పోరాట ఫలితంగానే ఈ నిర్ణయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 311 మంది బాధితులకు ఇంటి పట్టాలతో పాటు "ఇందిరమ్మ ఇల్లు" పథకం కింద ఇళ్ల నిర్మాణం కూడా మంజూరు చేయడం ప్రజల విజయం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేసినట్టేనని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పట్టాలు అందజేయడం పట్ల తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు, శుభాభినందనలు తెలియజేశారు. ఇంకా మిగిలిన అర్హులైన బాధితులకు కూడా త్వరగా ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు వంట సామగ్రి, బట్టలు, పిల్లల చదువుల కోసం పాఠశాల, తాగునీటి సదుపాయం, ఉచిత విద్యుత్, పార్కులు వంటి మౌలిక వసతులు కల్పించి ఆ ప్రాంతాన్ని మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన సంఘాలు, నాయకులు, బాధితుల ఐక్యతే ఈ విజయానికి కారణమని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు పట్టాలు అందించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# అగ్ని ప్రమాదానికి గురైన కారు... మంటలు అదుపు చేసిన ఫైర్ సిబ్బంది... తప్పిన పెను ప్రమాదం

**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 10 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణంలోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ సమీపంలో మరమ్మతుల గురై గత కొద్ది నెలలుగా నిలిపి ఉన్న రేనాల్డ్ డస్టర్ కారులో బుధవారం సాయంత్రం మంటలు చెల్లరేగాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం తెలపడంతో వెంటనే ఘటన స్థలానికి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఫైర్ సిబ్బందితో చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించడంతో చుట్టుపక్కల గుజిరి దుకాణాలలో మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు 20 వేల రూపాయల కారు అగ్ని ప్రమాదానికి గురైనట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు.



# పేద విద్యార్థులకు 'జయన్న ఫౌండేషన్' ఆర్థిక భరోసా





● పదో తరగతి విద్యార్థులకు నగదు,పరీక్షా సామాగ్రి పంపిణీ... ● వచ్చే ఏడాది నుంచి ఉచిత బ్యాగులు, శానిటరీ ప్యాడ్స్ ● ఫౌండేషన్ చైర్మన్ సరిత జైపాల్ రెడ్డి ప్రకటన...

**హుజురాబాద్,మార్చి11(పీసీబ్ల్యూన్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు హుజురాబాద్ మండలం సింగాపూర్ కు చెందిన 'జయన్న ఫౌండేషన్' మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో రవాణా, అల్పాహార ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంతో పాటు అవసరమైన పరీక్షా సామాగ్రిని బుధవారం హుజురాబాద్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుడిపాటి సరిత జయ్ పాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (వీజూ) విడపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల చదువును తక్కువ అంచనా వేయవద్దని, నేడు దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న ఎందరో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ బడుల్లో చదువుకున్నవారేనని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను వివరిస్తూ.. విద్య సమాజాన్ని ప్రశ్నించే శక్తిని ఇస్తుందని తెలిపారు.ముఖ్యంగా పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు వరంగల్ నుండి మానసిక వైద్య నిపుణులను రప్పించి విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇప్పించారు. ఒత్తిడిని జయించి పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో నిపుణులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.రూ. 700 నగదు మరియు ఎగ్జామ్ కిట్లు హుజురాబాద్ మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు, పరీక్షల సమయంలో ఒక్కొక్కరికి 700 రూపాయల నగదును గిఫ్ట్‌గా అందజేశారు.దీనితో పాటు: ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, హాల్ టికెట్లు భద్రంగా ఉంచుకోవడానికి ప్రత్యేక కవర్లతో కూడిన కిట్లు."చిన్నతనంలో ప్యాడ్ లేక పక్క విద్యార్థిని అడిగి పరీక్ష రాసిన కష్టాన్ని నేను అనుభవించాను. ప్రస్తుత విద్యార్థులకు అటువంటి పరిస్థితి రాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని సరిత జైపాల్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు.వచ్చే విద్యా సంవత్సరం (జూన్) నుండి ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి:ఐడి కార్డులు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు అందజేస్తానని.విద్యార్థినులకు ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్లను ఉచితంగా పంపిణీ చేస్తాఅని తెలిపారు.పదో తరగతి ఫలితాల్లో టాప్ 3లో నిలిచిన వారికి నగదు పురస్కారాలు కూడ ప్రకటించారు. సామాజిక సేవలో అగ్రగామిజయన్న ఫౌండేషన్ గతంలో 5000 మందికి కంటి పరీక్షలు, 1289 మందికి ఉచిత శస్త్రచికిత్సలు చేయించింది. మార్చి 20 నుండి తిరిగి మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వెల్లడించింది. సంపాదించే ప్రతి రూపాయిలో 50% పేద ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం 17వ వార్డు కౌన్సిలర్ కాలిక్ హుస్సేన్,పలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, వేల్పుల రత్నం, పలకల ఈశ్వర్ రెడ్డి మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

# ఖమ్మంలో కాషాయ దళం ఘన విజయం..

● ఎట్టకేలకు వెలుగుమట్ల బాధితులకు న్యాయం ● కూల్చిన చోటే 311 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం, ప్రతినిధి మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిరుపేదల సొంతింటి కలను ఛిద్రం చేస్తూ ప్రభుత్వం చేసిన కూల్చివేతలపై భారతీయ జనతా పార్టీ చేసిన అలుపెరగని పోరాటం ఎట్టకేలకు ఫలించిందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు బుధవారం ఒక పత్రికా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయి వీధినపడ్డ బాధితులకు అడుగడుగునా అండగా నిలిచిన కమలనాథులు.. సర్కారు మెడలు వంచి పేదలకు అదే స్థలంలో ఇళ్ల పట్టాలు సాధించిపెట్టారని ఆయన పేర్కొన్నారు.సుమారు పదిహేను రోజుల క్రితం, ఎటువంటి ముందస్తు నోటీసులు కానీ, కనీస సమాచారం కానీ ఇవ్వకుండా అర్ధరాత్రి వేళ భారీ పోలీసు బలగాల మోహరింపు మధ్య పేదల ఇళ్లను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కూల్చివేసింది. ఈ అమానుష చర్యతో వందలాది కుటుంబాలు నిరాశ్రయులై రోడ్డున పడ్డాయి. ఈ దారుణ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు తోపాటు జిల్లా, మండల, స్థానిక నాయకులతో కలిసి తాను హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నానని కోటేశ్వరరావు గుర్తుచేశారు. బాధితుల ఆర్తనాదాలు విన్న తాము, ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడటమే కాకుండా, నిరాశ్రయులై ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్న బాధితులకు అండగా నిలిచి భోజన సదుపాయాలు కల్పించామని ఆయన తెలిపారు.స్థానిక నాయకత్వం ఈ సమస్యను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో విశేష కృషి చేసిందని ఆయన వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, సీనియర్ నాయకులు, ఎంపీ ఈటల రాజేందర్ తదితర జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులను వెలుగుమట్లకు తీసుకువచ్చి బాధితుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాము. అధిష్టానం మద్దతుతో ఈ అన్యాయంపై జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లకు ఫిర్యాదు చేశాము. స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ స్వయంగా వెలుగుమట్లను సందర్శించి అధికారుల ఏకపక్ష వైఖరిని ఎండగట్టారని ఆయన తెలిపారు.బీజేపీ శ్రేణులు బాధితులతో కలిసి రోజుల తరబడి రోడ్డెక్కి చేసిన ఆందోళనలు, ధర్నాల ముందు ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చిందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులకు ఇళ్లు కూల్చిన చోటే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పోరాట ఫలితంగా మొత్తం 311 మంది నిరుపేదలకు 75 గజాల చొప్పున సుమారు 5 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బీజేపీ సాధించిన చారిత్రాత్మక విజయం అని ఆయన అభివర్ణించారు.అయితే, తమ పోరాటం ఇక్కడితో ఆగిపోలేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెలుగుమట్లలో మొత్తం 62 ఎకరాల భూదాన్ భూమి ఉండగా, అందులో ఏకంగా 30 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, ఆక్రమణదారుల చెరలో ఉన్న ఆ భూమిని కూడా వెలికితీసి పేదలకు దక్కేలా చేసేంత వరకు తమ న్యాయపోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. పేదల హక్కుల కోసం బీజేపీ ఎల్లప్పుడూ ముందువరసలో ఉంటుందని ఈ విజయం మరోసారి నిరూపించిందని ఆయన ఉద్ఘాటించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రుల నిలదీత

జర్నలిస్టుల ఇండ్ల సమస్యను వెంటనే పరిష్కరించండి

టీయూడబ్ల్యూజే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి డిమాండ్



**ఖమ్మం, ప్రతినిధి మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** దశాబ్ద తరబడి అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లతో కూడిన జర్నలిస్టుల బృందం నిలదీశారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో బుధవారం జరిగిన అధికారిక కార్యక్రమంలో ముగ్గురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జె టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు జర్నలిస్టుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. దశాబ్దాలు తరబడి జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, అనేక దఫాలుగా వినతిపత్రాలు విజ్ఞప్తులు, చేస్తున్న తీవ్ర కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వైఖరి సరైంది కాదని, ఇప్పటికైనా జర్నలిస్టులకు తక్షణమే ఇళ్లస్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలపై సత్వరమే సమాలోచనచేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు అంశంలో కూర్చొని చర్చించి సమస్యను పరిష్కరించుకుందామని మంత్రులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టియు డబ్ల్యూ జే టి.జె.ఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు,ఎలక్ట్రాన్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్,ఎలక్ట్రాన్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, సాయి , ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఉపాధ్యక్షులు పానకాలరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్ రెడ్డి,వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, సుధాకర్, ఐజేయు నాయకులు గుండ్ల రాంబాబు, టీజేఎఫ్ నాయకులు మోహన్, తోట గణేష్, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్రములో మాలలు ఉన్నారా లేరా..?

● అన్ని రాజకీయ పార్టీలకు మాలల మీద ఇంత వివక్ష ఎందుకు...

తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. మేడి అంజయ్య



**కరీంనగర్ ప్రతినిధి మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత దేశం లో మహా రెడ్మెంట్ అనే సైనిక ప్రతేక విభాగం ఉన్నది అందులో మాలలు మహర్లు మాత్రమే ఉంటారు దేశం లో అత్యంత ప్రమాదం వచ్చినప్పుడు మాలలు మాత్రమే ప్రాణ త్యాగాలు చేస్తారు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మాలల పై ఇంత వివక్ష ఎందుకు.. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మాలల మీద ఇంత కపట నాటకం ఎందుకు రోస్టర్ విధానం పై పునరాలోచ చేయాలి...మాల ఉద్యోగులు మాల విద్యార్థులు తీవ్రమైన ఇబ్బంది కి గురి అవుతున్నారు. మాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇబ్బంది అవుతుంది అలాగే మాల విద్యార్థులకు మెడికల్ కాలేజీ లో కానీ నర్సింగ్ కాలేజీ లో కానీ..సీట్ల కేటాయింపుల్లో వివిధ కాలేజీ ల్లో యూనివర్సిటీ ల్లో పై చదువుల కోసం విద్యార్థుల కు అన్యాయం జరుగుతుంది.. మాల నిరుద్యోగులకు గ్రూప్ 1,2,3,4 ల లో ఉద్యోగాల కోసం రోస్టర్ విధానం తో మాల జాతి బిడ్డల భవిష్యత్ అంధకారం లోకి వెళ్ళింది..రోస్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి మాల జాతి బిడ్డల భవిష్యత్ కోసం పునరాలోచన చేయవలసిన అవసరం ఉన్నది..మాల ప్రజా ప్రతి నిధులు మాల ఉద్యోగ సంఘాల నాయకులు మాల సంఘాల నాయకులు మన పిల్లల భవిష్యత్ గత సంవత్సరం నుండి అంధకారం లోకి వెళ్ళినది మన మాల సంఘాలు అని చెప్పుకునే నాయకులం మన జాతి పైన జరుగుతున్న వివక్ష ను చూసి ఇకనైనా మనం మేలుకోవలసిన అవసరం ఉందా లేదా..? మాల కేటగిరి లో మంత్రులు ఐనారు ఎమ్మెల్సీలు ఐనారు పదవి వచ్చే వరకేనా జాతి పైన ప్రేమ..? పదవులు వచ్చిన తరువాత జాతి ని మరచిపోవడమేనా..? జాతిని మరచిపోయిన మాల సంఘాలకు మాల ఉద్యోగ సంఘాల కు మాల ప్రజా ప్రతి నిధులకు విజ్ఞప్తి.. రానున్న అంబేద్కర్ జయంతి వరకు జాతి కి జరిగే అన్యాయం గురించి ప్రశ్నిచ్చకపోతె.. మాట్లాడకపోతే..మాల జాతి మూర్ఖులు గా మిగలవద్దు అని వేడుకుంటున్నాను...మాల జాతి ని చేతన్యం చేద్దామా..తుంగలో తొక్కుదామా ఆలోచించవలసిన అవసరం ఉంది మాల జాతి ఉద్యమ కారులు...జై భీమ్..జై మాల మేడి అంజయ్య తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# భూక్య జంపన్న ఆధ్వర్యంలో మారుమూల గ్రామ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు





తాడ్వాయిలో 26వ విడత మెగా కంటి వైద్య శిబిరం సేవా కార్యక్రమాలకు ప్రజల ప్రశంసలు

**తాడ్వాయి,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే సంకల్పంతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం 26వ విడత ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి తాడ్వాయి మండలంతో పాటు పరిసర మారుమూల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు ప్రజలకు కంటి సంబంధిత పలు పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు తగ్గడం, కంటి అలర్జీలు, ముత్యబిందు వంటి సమస్యలను గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్ కోసం ప్రత్యేక బస్సులో శంకర కంటి ఆసుపత్రి, హైదరాబాద్ కు పంపించారు. ఈ శిబిరం ద్వారా పేద మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగం కలిగిందని స్థానికులు తెలిపారు.గ్రామాల్లో నివసించే ప్రజలకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని భూక్య జంపన్న స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తోడుగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ములుగు జిల్లా వ్యాప్తంగా మరియు పరిసర ప్రాంతాల్లో వరుసగా 26 విడతలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ఆయన సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఖరీదైన చికిత్సలు చేయించుకోలేని పరిస్థితుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందించడం ఎంతో అవసరమని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ భూక్య జంపన్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన తాడ్వాయి గ్రామ సర్పంచ్ గంట ప్రవళిక గున్ను గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గం నవీన్, మాజీ ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్ర రెడ్డి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు తుమ్మల రాజేందర్, యూత్ నాయకులు మనుకొండ నవీన్, చీమల శ్రవణ్ కుమార్, కొత్తూరి రోహిత్, గట్టు వంశీ, ఠాకూర్ సురేందర్, కళ్ళేబోయిన రాకేష్, గంట మనోజ్ రెడ్డి, కిట్టు గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత దివంగత సమద్ నవాబ్ స్మారకర్ధం టేమ్రిస్ బాలుర-2లో ఇఫ్తార్ విందు..





**కరీంనగర్ జిల్లా మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవలే మరణించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దివంగత సమద్ నవాబ్ స్మారకార్థం ఆయన పెద్ద కుమారుడు కాంగ్రెస్ నేత, హుస్సేనీపుర 32వ డివిజన్ నుండి పోటీ చేసిన అహాద్ నవీద్, కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లా గ్రామంలో టేమ్రిస్ బాలుర 2లో పేద విద్యార్థుల కోసం అద్భుతమైన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వర్ బియాబానీ సాహెబ్, హాఫీజ్ ఇష్తియాక్ సాహెబ్, సాలార్ వాజిద్, యూనస్, అలీమ్ నవాజ్ పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి ఇఫ్తార్ చేయడం నిజంగా సంతోషకరమైన మరియు శాంతియుత క్షణం. ఈ సందర్భంగా అహాద్ నవీద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల విద్య మరియు వారి భవిష్యత్తు అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజహర్ ఉద్దీన్, టేమ్రిస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి మార్గదర్శకత్వంలో, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ పథకాలు అన్ని అభివృద్ధి పనులు నేరుగా పర్యవేక్షించబడుతున్నాయని చెప్పారు. విద్యార్థులతో ఇఫ్తార్ చేయడం ఒక చిరస్మరణీయమైన మరియు సంతోషకరమైన క్షణం. మమ్మల్ని ఎల్లప్పుడూ ఇలాంటి సత్కార్యాలలో భాగస్వామ్యం కావించమని అల్లాహ్ ను కోరుకున్నట్లు అహాద్ నవిద్ చెప్పారు.

# డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల
- దళారులకు చెక్ పెడుతూ అర్హులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు
- 311 మందికి భూదాన్ భూమిలో భూమి పట్టాతో పాటు ఇందిరమ్మ ఇండ్లు
- 101 మంది అర్హులకు వారి సొంతూర్లలో ఇందిరమ్మ ఇండ్లు
- యుద్ధ ప్రాతిపదికన మౌళిక వసతుల కల్పన పనులు
- దళారుల నుంచి బాధితులకు డబ్బు వసూలు చేసి అందిస్తాం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

పత్రాలను అందజేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు







ఖమ్మం ప్రతినిధి, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) : డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావులు వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇండ్లు ఉండాలని నిర్ణయం తీసుకుని తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తుందని తెలిపారు. పేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది కావాలని బురద చల్లుతున్నారని తెలిపారు. పేదల నిస్సహాయత ఆసరాగా తీసుకొని సమాంతరమైన వ్యవస్థ ఏర్పాటు చేసి త్రాగునీరు, బడి, విద్యుత్ సదుపాయం వంటి సౌకర్యాలు లేకుండా పేదలు భయం లోనే బ్రతికేలా విష వలయం పన్నారని డిప్యూటీ సీఎం అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం నేడు పట్టాలు అందిస్తుందని అన్నారు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంతమంది కావాలని దురుద్దేశంతో సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారని, ఎవరు ఏం ప్రచారం చేసిన పేదలకు న్యాయం జరగాలనీ అంతిమ లక్ష్యాన్ని సాధించే దిశగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ దురుద్దేశాలు, ప్రభుత్వాన్ని విమర్శించారు అనే పట్టింపులు లేకుండా అర్హులైన 412 మంది నిరుపేద కుటుంబా లకు ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లను నేడు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదలను అనేకమంది అనేకసార్లు వచ్చి బెదిరించే వారని, భయాందోళనల మధ్య గతంలో వారు గడిపారని, ఆ పరిస్థితికి నేడు ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన పట్టాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కార్యక్రమం గురువారం జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇతర మౌళిక వసతులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించు కోవాలన్నారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్ ను పది సంవత్సరాల పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేసిన ప్రతిపక్షాలు ప్రశ్నించడం హాస్యాస్పదమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత తమకు ఉందా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని డిప్యూటీ సీఎం హితవు పలికారు. పేదల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేసిన ప్రతి ఒక్కరికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, ప్రతి ఒక్క రూపాయి నిందితుల నుంచి వసూలు చేసి బాధితులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యే విధంగా మన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తుందని తెలిపారు. వెలుగు మట్ల భూదాన్ భూములలో పేదలకు పంచగా మిగిలిన భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కూల్స్ పక్క భవనాలకు ఆ స్థలం ఉపయోగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వెలుగుమట్ల లబ్ధిదారులు నేటి నుంచి నిర్భయంగా ఉండాలని, మోడల్ కాలనీగా తయారు చేసి అందించే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపారు.రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... మార్చి 1, 2026 నాడు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలైన లబ్ధిదారులకు సీఎం, కేబినెట్ సహచరుల సహకారంతో 311 మంది ఇంటి స్థలం లేని వారికి ఇండ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం, సొంత ఊరిలో స్థలం ఉన్న మరో 101 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి భేషజాలు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేతలు జరిగిన తర్వాత ప్రధాన ప్రతిపక్ష నాయకులు వచ్చి మొసలి కన్నీరు కార్చారని మంత్రి ఎద్దేవా చేశారు. 2023 జూలై నెలలో ఎన్నికల కంటే ముందు వెలుగు మట్ల ప్రాంతంలో కూల్చివేతలకు గత ప్రభుత్వం పాల్పడింది వాస్తవం కాదా, 9 సంవత్సరాలుగా పేదలు ఎటువంటి వసతులు లేకుండా నివసిస్తుంటే చూస్తూ ఊరుకున్నారు తప్ప ఎటువంటి పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించే సమయంలో పేదలకు పట్టాలు ఇవ్వాలనే బుద్ధి జ్ఞానం ఎందుకు రాలేదని మంత్రి విమర్శించారు. గత పాలకులకు విశాల హృదయం లేదని, తమ ప్రభుత్వం ప్రజల కష్టాలను చూసి చలించి నేడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షానికి లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు మా ప్రభుత్వం వస్తుందని పగటి కలలు కంటున్నారని, అనేక ఎన్నికల ఫలితాలు వస్తున్నప్పటికీ మార్పు చెందకుండా కక్ష పూరిత మనస్తత్వం తో ప్రవర్తిస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాటు పేదలను పట్టించు కోలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు ఇస్తుందని అన్నారు. త్రాగునీరు, రోడ్లు, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, స్కూల్, విద్యుత్ సరఫరా వంటి అనేక మౌళిక వసతుల వసతుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. గత 8 సంవత్సరాలుగా పేదలు ఇబ్బందులు పడిన మాట వాస్తవమేనని, ఆ సమస్యలకు నేడు పరిష్కారం లభిస్తుందని, అర్హులైన బాధితులు ఎవరైనా ఇంకా మిగిలి ఉంటె వారికి కూడా తమ ప్రభుత్వం తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. పేదలను మోసం చేసి దళారులు వసూలు చేసిన డబ్బు ఒక్క రూపాయి కూడా వదలకుండా పూర్తి స్థాయిలో వసూలు చేసి బాధితులకు అందించాలని మంత్రి పోలీస్ కమీషనర్ ను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... పేదలను కొంత మంది ముఠాగా ఏర్పడి మోసం చేస్తే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు పేరిట ఇచ్చిన పత్రాలు బోగస్ అని, సిసిఎల్ఏ ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. లాఠీ ఛార్జ్ లేకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేసి దగా కోరులను తరిమివేశామని మంత్రి తెలిపారు. నిరుపేదలకు వెలుగు మట్ల భూదాన్ భూములలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్నామని, పిల్లల భవిష్యత్తు కోసం ఇక్కడ మోడల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన రహదారులు, విద్యుత్, మంచి నీరు, రోడ్లు, డ్రైయిన్ వంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి గారిని తీసుకువచ్చి భూ దాన్ భూములలో నూతనంగా చేపట్టే 311 మంది లబ్ధిదారుల కాలనీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుపేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో కొంత ఇబ్బంది పడటం జరిగిందని ఆయన తెలిపారు. అనధికారికంగా నిరుపేదలు నివసించే దుస్థితి రాకుండా అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. 311 మంది లబ్ధిదారులే కాకుండా మరో 101 మంది నిరుపేదలకు వారి సొంత ఊరిలో ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వెలుగుమట్ల కాలనీ అద్భుతంగా తీర్చి దిద్దుతామని, పేదల దగ్గర డబ్బులు వసూలు చేసిన దళారుల వివరాలు పోలీసులకు అందించాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... వెలుగు మట్ల భూదాన్ భూములకు సంబంధించి పెద్ద భూ మాఫియా నడుస్తుందని, ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. 311 మంది నిరుపేదలకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలు నివసించే కాలనీలో ఇండ్లతో పాటు పార్క్, రోడ్డు, స్కూలు, విద్యుత్తు, త్రాగు నీరు వంటి మౌళిక సదుపాయాల పనులు కూడా వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక కేసు క్రింద పరిగణించి ఇంటి నిర్మాణానికి మంజూరు చేసే నిధులు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన్ భూముల నిర్వాసితుల బాధితులలో పారదర్శకంగా చేపట్టిన సర్వే ద్వారా అర్హులుగా గుర్తించిన 311 మంది లబ్ధిదారులకు నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల చేతుల మీదుగా వెలుగు మట్లలో ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములలో లేఔట్ వేసి 311 ప్లాట్ లు చేశామని, లబ్ధిదారులకు పారదర్శకంగా సాఫ్ట్ వేర్ తో మానవ ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ ద్వారా ప్లాట్ లు కేటాయించామని తెలిపారు. 1953 రికార్డుల ప్రకారం 147, 148, 149 సర్వే నెంబర్ లో 31 ఎకరాల 7 గుంటల భూమినీ రాజా రామారావు భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... 2014లో కత్తి రామ చంద్రయ్య, ముత్తయ్య, కల్లూరి కృష్ణ, బాబురావు, ఇతరులు ఇలా 21 మంది సభ్యులు కలిసి ఒక సంఘం తయారుచేసి భూదాన్ భూములను కబ్జాచేసి పేదల దగ్గర నుంచి 30 వేల నుంచి మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేసి భూమి పట్టాలు ఇస్తామని ఆక్రమణలు చేయించా రని, వీరిపై ఇప్పటివరకు 26 కేసులు నమోదుచేసి 11 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కల్లూరు కృష్ణ ఇంటిలో చేపట్టిన తనిఖీ లలో మూడు కోట్ల రూపాయల వరకు పేదల నుంచి వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయని, వీరి ఆస్తులు వివరాలు సేకరించి వాటి ద్వారా పేదల నుంచి వసూలు చేసిన డబ్బు రికవరీ కు ప్రయత్నం చేస్తామని సిపి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వెలుగు మట్ల లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత 8 సంవత్సరాలుగా భూదాన్ భూములలో ఉంటున్నప్పటికీ రోడ్లు, కరెంట్, త్రాగునీరు వంటి మౌళిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడ్డామని, నేడు అన్ని వసతులతో కూడిన లేఔట్ లో తమకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని, నిరుపేదలైన తమను అర్హులుగా ఎంపిక చేసి పట్టాలు పంపిణీ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. దళారులు కొంతమంది పార్టీ ఫండ్, విద్యుత్ పోల్స్, భూమి రెగ్యులరైజ్ కోసమని తమ దగ్గర నుంచి డబ్బులు వసూలు చేశారని, ప్రజలను మోసం చేస్తున్న వారికి శిక్ష పడే విధంగా చూడాలని మంత్రులను లబ్ధిదారులు కోరారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలు ఇచ్చారు కేసులు ఎత్తివేయండి

- భూదాన భూములపై శ్వేతపత్రం ప్రకటించండి

- మిగతా లబ్ధిదారులకు కూడా ఇల్లు నిర్మించి ఇవ్వండి

- ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కొంచెం ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను తెలుసుకొని వెలుగుమట్లలోని భూదాన భూముల లబ్ధిదారులకు అక్కడే ఇళ్ల స్థలాలు ఇవ్వడం మంచి నిర్ణయం, అలాగే భూదాన భూముల అంశంలో అరెస్టు కాబడ్డ వారందరిపై కేసులు ఎత్తివేసి, భూదాన భూముల మొత్తం వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని, మిగతా లబ్ధిదారులకు సైతం అక్కడే ఇల్లు నిర్మించి ఇవ్వాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూదాన భూముల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, మిగతా లబ్ధిదారులకు కూడా ఇక్కడే ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. వారంతా పేదలు నిజమైన లబ్ధిదారులుగా భావించారు కాబట్టే అధికారులు ఆ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించుకున్న విషయం స్పష్టంగా అర్థం చేసుకుంటే మరి కేసులు ఎందుకు, ఆందోళనలు ఎందుకు? కూల్చివేతలు ఎందుకు? జరిగాయో వివరించాలని తెలిపారు. ఇతర చోట్ల నుండి వచ్చిన లబ్ధిదారులకు వారి సొంత ప్రాంతాలలోనే ఇళ్లస్థలాలు కేటాయిస్తా మనడం సమంజసంగా లేదన్నారు. వారికి కూడా ఇక్కడే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన బోర్డు చైర్మన్ చెప్తున్న దానికి విరుద్ధంగా అధికారులు భూదాన భూముల లెక్కలను తగ్గించి చెప్పటం వెనుక కుట్ర ఉందనే అనుమానం కలుగుతుందన్నారు. 62 చిల్లర ఎకరాల స్థలాన్ని 31 ఎకరం వరకు కుదించి, ఇదే భూదాన భూమి మొత్తం అనడం భావ్యం కాదన్నారు. అసలు వెలుగుమట్లలో అదికారులు పేర్కొంటున్న సర్వే నెంబర్లను అనుసరించి మొత్తం భూదాన భూమి ఎంత ఉందని, ప్రవేట్ భూమి ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత ఉంది? ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నే కాకుండా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా భూదాన భూమి ఎంత ఉంది ? ఎవరెవరి చేతులలో ఎంత భూమి ఉందో ?ఎవరెవరు ఆక్రమించుకున్నారు? ప్రభుత్వమే తన అవసరాలకు ఎంత ఉంచుకున్నది? అనే అంశాలపై సమగ్ర వివరాలను అందించేందుకు గాను శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెల్లారుజానే అమానుషంగా ఇళ్లు కూల్చి వేత ఘటనలో మద్దతు ప్రకటించిన వారిపై, ప్రశ్నించిన వారిపై, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం అన్యాయం, వెంటనే కేసులు చేయడంతో పాటు ఈ ఉదంతంలో అతి ఉత్సాహం చూపించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 26న ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బార్ అసోసియేషన్ కు ఈనెల 26న జరుగబోయే ఎన్నికల నామినేషన్ గడువు బుధవారంతో ముగిసింది. ప్రెసిడెంట్ గా మోజెస్ క్రిస్టఫర్ జి, విజయ రాఘవ అయ్యదేవర, రమేష్ యడ్లపల్లి, వెంకటేశ్వర రావు గుప్తా సుగ్గల తమ నామినేషన్ ను దాఖలు చేసారు. వైస్ ప్రెసిడెంట్ గా జానిమియా షేక్, ప్రధాన కార్యదర్శి గా అమర్ నాథ్ కందుల, వెంకట నారాయణ, తాళ్ల రవి, కుమార్ కందుల, జాయింట్ సెక్రటరీ గా దొబ్బల శిరీష, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా రామదాసు దారావత్, లైబ్రరీ సెక్రటరీ గా కళ్యాణి దేవరకొండ, ట్రెజరర్ గా రాజేశ్వరి వికెడి మహిళా న్యాయవాద ప్రతినిధిగా రాధమ్మ కనపర్తి తమ నామినేషన్ దాఖలు చేసారు. ఈనెల 12న నామినేషన్ పత్రాల స్క్రూటినీ, 17న విత్ డ్రా కు గడువు అని ఎన్నికల అధికారులు పి.ఏ.జె శేకర్ రాజ్, ఎం.ఎ తౌఫిక్, మారగాని శ్రీనివాస్, పి. వెంకన్న లు తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు: బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష





**పెద్దపల్లి,మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని ఎంబీ గార్డెన్ వేదికగా బుధవారం సాయంత్రం మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా జరిగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ శ్రీమతి దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరై,ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.సాయంత్రం వేళ ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలను విరమించగా,వారికి ఆమె స్వయంగా పండ్లను, పానీయాలను వడ్డించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దాసరి ఉష ప్రసంగిస్తూ పవిత్ర రంజాన్ మాసం కేవలం ఉపవాస దీక్షలకే పరిమితం కాదని,ఇది మానవత్వానికి, క్రమశిక్షణకు మరియు తోటివారికి సహాయం చేసే దానగుణానికి ప్రతీక అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన భారతీయ సంస్కృతిలోని గొప్పతనమని,ఈ ఇఫ్తార్ విందు గంగా-జమునా తెహజీబ్ ను ప్రతిబింబిస్తోందని ఆమె పేర్కొన్నారు. మైనార్టీ యువత సమాజ సేవలో ముందుండాలని,ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఐక్యతను చాటడం అభినందనీయమని ఆమె యువతను ఉత్సాహపరిచారు.ముస్లిం సోదరులందరికీ రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ,అల్లాహ్ ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ యూత్ ప్రతినిధులు ఎండి మొహిద్,సయ్యద్ మసీద్ మాలిక్,బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్,బీసీ జేఏసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి అలువాల రాజేందర్,బీసీ జేఏసీ యాదవ సంఘం జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమురయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,బొల్లం భూమేష్,కూకట్ల నవీన్ కుమార్,శ్రావణ్, భూమయ్య,వివిధ సంఘాల నాయకులు,పట్టణ ప్రముఖులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో మహిళలు రాణించాలి: మున్సిపల్ చైర్మన్ గాదే చంద్రకళ

### సామాజిక న్యాయ వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమం



**ములుగు మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** రాష్ట్ర రాజకీయాల్లో మహిళలు చురుగ్గా పాల్గొని రాణించాలని ములుగు మున్సిపల్ చైర్మన్ గాదే చంద్రకళ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలో సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షులు బాణాల ప్రభాకర్ రావు అధ్యక్షతన బుధవారం మున్సిపల్ చైర్మన్ తో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రకళ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీల మధ్య పోటీ ఉంటుందని, గెలిచిన తర్వాత కౌన్సిలర్లందరూ ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి పనిచేస్తామని తెలిపారు. కులమతాలకు అతీతంగా, పారదర్శకమైన పాలన అందిస్తూ ములుగు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదే చంద్రకళతో పాటు కౌన్సిలర్లు భిక్షపతి పటేల్, నల్లెళ్ళ స్వాతి భరత్ పటేల్, వైకాని సునీత ఓదెలు యాదవ్, బైకానీ అనుష సాగర్ యాదవ్, గంద్ర కోటవాణి కుమార్ యాదవ్, యాసం వసంత రవి యాదవ్, పద్మ, కోయిల లక్ష్మి, గుంటోజు పావని, గుగ్గిళ్ళ దివ్య, రేసోజు పద్మ వేణుగోపాలాచారి తదితరులను సామాజిక న్యాయ వేదిక ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సాంబయ్య, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర సలహాదారులు కొమ్మినేని భూపాల్ రావు పటేల్, రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మహిళా న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బా ఉమా రాజేందర్ మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో గోనెల భరత్ ముదిరాజ్, కుతుబుద్దీన్, కె. నవీన్, సిలువేరు సాంబయ్య, దామెరుప్పుల మధు స్వామి, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు బాలాజీ బబ్లూ, శ్యామ్ నాయక్, ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు మోరే రాజన్న, పద్మశాలి నాయకులు రాంమూర్తి, కందకట్ల సారయ్య, సగర సంఘం నాయకులు నలువాల నర్సయ్య, నాయకపు పొడ్ జిల్లా అధ్యక్షులు విష్కుల సమ్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు యాకన్న మాదిగ, నటరాజ్ మాదిగ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రాజన్న, బాణాల రాజ్ కుమార్, ఎన్. వెంకటేశ్వర్లు యాదవ్, బైకాని విష్ణు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తప్పిపోయిన బాలికను క్షేమంగా తల్లికి అప్పగించిన పోలీసులు



**పరకాల, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో తప్పిపోయిన బాలికను పోలీసులు క్షేమంగా గుర్తించి తల్లికి అప్పగించారు. వివరాల ప్రకారం శాయంపేటకు చెందిన ఒక మహిళ పరకాల పట్టణంలోని ఏడో వార్డులో నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె కనిపించకుండా పోవడంతో స్థానికులు రాత్రి సుమారు 8 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన పరకాల సీఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఆచూకీ కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీసు సిబ్బందితో కలిసి రాత్రి దాదాపు 11 గంటల వరకు పరకాల పట్టణంలో విస్తృతంగా వెతికారు.దర్యాప్తులో భాగంగా బాలిక తన అమ్మమ్మ ఇంటికి శాయంపేటకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం తల్లికి కౌన్సిలింగ్ నిర్వహించి బాలికను తల్లికి అప్పగించారు.తల్లి-కూతుళ్లను సురక్షితంగా వారి స్వగ్రామమైన శాయంపేటకు పంపేలా సీఐ క్రాంతి కుమార్ ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ పరకాల పట్టణంలో ఎవరైనా కనిపించకుండా పోతే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పోలీసులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారని ఆయన తెలిపారు.

# గ్లకోమా పట్ల అప్రమత్తంగా ఉందాం...చూపును కాపాడుకుందాం

**• జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**







**కర్నూలు మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** గ్లకోమా పట్ల అప్రమత్తంగా ఉండి, చూపును కాపాడుకుందామని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అన్నారు.బుధవారం ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ కంటి ఆసుపత్రి నుండి రాజవిహార్ సెంటర్ వరకు నిర్వహించిన వాకథాన్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో "ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు" మార్చి 8 నుండి మార్చి 14 వరకు ఘనంగా ప్రారంభమయ్యాయన్నారు. ఈ సంవత్సరం "గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యమవ్వండి" అనే నినాదంతో ఈ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు.గ్లకోమా (నీటి కాసులు) అనేది కంటి చూపును హరించే నిశ్శబ్ద శత్రువు అని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. 40 ఏళ్లు పైబడిన వారు, కుటుంబంలో గ్లకోమా చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.భాస్కర్,కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డా.సత్యనారాయణ రెడ్డి,హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డా.యుగేందర్ రెడ్డి, జిల్లా అందత్వ నివారణ అధికారి డా.హిమబిందు,సుశీల నేత్రాలయ తరపున డా.సుధాకర్ రావు,డా.నేహా,మోడరన్ ఐ హాస్పిటల్ తరపున డా.రాజశేఖర్,డా.అనిల్ కుమార్,రిటైర్డ్ సూపరింటెండెంట్ డా.గిడ్డయ్య,ఐ.ఎం.ఏ సభ్యులు డా.రామచంద్ర నాయుడు,డా.నాగ సురేష్, డా.రాధిక, డా.పుష్పలత,అసిస్టెంట్ ప్రొఫెసర్స్,వైద్యాధికారులు,పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కావూరి సాంబశివరావు మృతి తీరని లోటు: ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఢిల్లీ మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** సీనియర్ రాజకీయ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు గారి మృతి పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీ లో ఉన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అక్కడినుంచే కావూరి మృతికి సంతాపం తెలుపుతూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కావూరి మృతి ఏలూరు జిల్లాతోపాటు రాష్ట్రానికే తీరనిలోటని, రెండుసార్లు ఏలూరు నుంచి, మూడు సార్లు మచిలీపట్నం నుంచి మొత్తంగా ఐదు సార్లు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన కావూరి సాంబశివరావు రాష్ట్రానికి విశేష సేవలు అందించారన్నారు. మన్మోహన్ సింగ్ గారి కేబినెట్‌లో కేంద్ర జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కావూరి జౌళి రంగంలో ఆధునీకరణకు ఆయన అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. అంతేకాకుండా 'కావూరి ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సామాజిక సేవలు నేటికీ ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయన్నారు. పారిశ్రామికవేత్తగా, సీనియర్ రాజకీయ నాయకునిగా ఎన్నో సేవలు అందించిన కావూరి సాంబశివరావు మృతి దిగ్భ్రాంతి కలిగించిందని చెప్పిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కావూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు పాటు పడుదాం




**కర్నూలు మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటు పడుదాం అని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు.బుధవారంబాల్య వివాహాలు, సైబర్ మోసాలు, మహిళల భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, మహిళల భద్రత పై పోలీసులు అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, పాఠశాలలు మరియు సమావేశాల ద్వారా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు.ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులు గ్రామాలు, పాఠశాలలు సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీల ద్వారా, గ్రామ సభలు , సమావేశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యంగా పోలీస్ సేవలపై, ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ప్రాముఖ్యత, విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ మోసాల నుండి జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాల గురించి వివరించారు. అదే విధంగా శక్తి యాప్, డయల్ 112 , చైల్డ్ లైన్ 1098, సైబర్ హెల్ప్ లైన్ 1930 టోల్ ఫ్రీ నంబర్ల వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈవ్ టీజింగ్, డ్రగ్స్ దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిరోధ చట్టం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల పై జరిగే నేరాల పై కూడా విద్యార్థులకు వివరించారు.

# వైవియు కాన్వకేషన్ సందేహాలకు ఎంక్వయిరీ నెంబర్ క్యూఆర్ కోడ్

**కడప, మార్చి11:(పిసిడబ్ల్యూన్యూస్):** యోగి వేమన విశ్వవిద్యాలయం 11వ, 12వ, 13వ, 14వ సమావేశాలు ఈనెల 13 మార్చి 2026న, ఉదయం 10:00 గంటల కు కడపలోని బుచుంపల్లిలోని డి ఎస్ ఆర్ పారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తోందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు తెలిపారు. ఈ కాన్వకేషన్ లో పట్టాలందుకొనే విద్యార్థుల సౌకర్యార్థం ఎంక్వయిరీ నెంబర్ (9703216198) ను ఏర్పాటు చేసినట్లు వివరించారువిద్యార్థుల సౌకర్యార్థం వైవియూ నుంచి, కడప ఆర్టీసీ, పాత బస్టాండ్, ఇర్కాన్ సర్కిల్ నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించామన్నారు.విశ్వవిద్యాలయం నుండి ఉదయం 8.00 గంటలకు 2 బస్సులు, కడప ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టాండ్ నుండి ఉదయం 8.30 గంటలకు 1 బస్సు, పాత బస్ స్టాండ్ నుండి ఉదయం 8.30 గంటలకు 1 బస్సు, ఉదయం 8.00 గంటల అలంఖాన్ పల్లి వైయస్సార్ సర్కిల్ నుంచి డీఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ (కాన్వకేషన్ జరిగే సమావేశ మందిరం) నికి నిరంతరం తిరుగుతూ ఉంటాయన్నారు. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అయ్యా ప్రాంతాలలో సేవలందిస్తారన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే కాన్వోకేషన్ జరిగే ప్లేస్ తెలుస్తుందన్నారు.